మేత కొరతకు చెక్

- పశువులకు ఇష్టమైన సమీకృత దాణా
- వేసవిలో పచ్చి గడ్డికి మంచి ప్రత్యామ్నాయం
- టీఎంఆర్ పేరుతో 261.8 మెట్రిక్ టన్నులు సరఫరా
- నియోజకవర్గంలో 409 మంది రైతులకు లబ్ధి
- పశుపోషకులకు ప్రభుత్వ సబ్సిడీతో చేయూత



కోరుకొల్లులో టీఎంఆర్ దాణాతో రైతులు



దాణా తింటున్న గేదెలు

కైకలూరు: పశు పోషకులకు ప్రభుత్వం సగం సబ్సిడీతో టోటల్ మిక్చర్ రేషన్(టీఎంఆర్)ను పంపిణీ చేస్తోంది. వేసవి ప్రవేశించడంతో గ్రామాల్లో పచ్చ గడ్డికి కొరత ఏర్పడింది. ఈ లోటును సమీకృత దాణా ద్వారా భర్తీ చేస్తున్నారు. ఎండు గ్రాసాలు, దాణా పదార్థాలతో తయారు చేసే టీఎంఆర్ దాణాను పశువులు ఇష్టంగా తింటున్నాయి. దీంతో అధిక పాల దిగుబడి వస్తోంది. రైతు భరోసా కేంద్రాల్లో కియోస్క్ యాంత్రాల్లో రైతులు ఆధార్ నంబర్ నమోదు చేసి నేరుగా అక్కడే నగదు చెల్లించి దాణాను బుక్ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది.

నియోజకవర్గంలో పరిస్థితి ఇది..

నియోజకవర్గం నాలుగు మండలాల్లో గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 409 మంది పశుపోషకులకు 261.8 మెట్రిక్ టన్నుల టీఎంఆర్‌ను 40 ఆర్‌బీకేల పరిధిలో సరఫరా చేశారు. మొత్తం గేదెలు 33,546, ఆవులు 5,756 ఉన్నాయి. సాధారణంగా 5 లీటర్లు పాలిచ్చే పశువుకు రోజుకు పచ్చి మేత 30–40 కేజీలు, ఎండుగడ్డి 10–15 కేజీలు, దాణా 5–10 కేజీలు అవసరమవుతోంది. టీఎంఆర్‌లో జొన్న, మొక్కజొన్న, సజ్జలు, రాగులు, కొర్రలు, నూనె తీసిన సోయాచెక్క, వేరుశనగ చెక్క, పత్తిచెక్క, వరి, గోధుముల తవుడు, కంది, మినుము, పెసరపొట్టు ఇలా సమీకృత ఆహారం మిళితమై ఉంటుంది.

మేతకు ఇబ్బంది లేకుండా..

వేసవిలో పచ్చగడ్డి దొరకదు. యంత్రాలతో కోస్తున్న ఎండిగడ్డిని తినడానికి పశువులు ఇష్టపడవు. దీంతో పశుపోషకులు టీఎంఆర్ వినియోగించాల్సి వస్తోంది. టీఎంఆర్ దాణాను బయట మార్కెట్లో కొనాలంటే కేజీ రూ. 13 ప్లస్ జీఎస్టీ పడుతుంది. దీనిపై ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ అందిస్తోంది. దీంతో రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ పాల ఉత్పత్తులను సాధిస్తున్నారు. ఈ రుచికరంగా మేత ఉండటంతో పశువులు మిక్చర్ మేతను తింటున్నాయి. కొల్లేరు ప్రాంతంలో వరి పొలాలు తక్కువ. చేపల, రొయ్యల చెరువులు విస్తీర్ణం ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాతంలో టీఎంఆర్‌ను అధిక శాతం పశుపోషకులు వినియోగిస్తున్నారు.

నియోజకవర్గంలో పరిస్థితి ఇది..

మండలం	సబ్సిడీని వినియోగించుకున్న రైతులు	కొనుగోలు చేసిన దాణా (టన్నుల్లో)
కైకలూరు	132	132.8
కలిదిండి	172	88.6
మండవల్లి	59	15.40
ముదినేపల్లి	46	25.00
మొత్తం	409	261.8

50 శాతం సబ్సిడీతో సరఫరా



టీఎంఆర్ దాణాను ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో రూ.6.50కే అందిస్తోంది. ఈ దాణాను పశువులు ఇష్టంగా తింటున్నాయి. వాటికి జీర్ణక్రియ బాగా జరుగుతోంది. ఆరోగ్యంగా ఎదుగుదలతో పాటు పాల ఉత్పత్తి పెరుగుతోంది. ఒక్కో రైతుకు 2 క్వింటాల నుంచి టన్ను వరకు పొందే అవకాశం ఉంది. ప్రభుత్వ పథకాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ పఠాన్ ముస్తాఫాఖాన్, వెటర్నరీ ఏడీ, కైకలూరు

ఆవులు ఇష్టంగా తింటున్నాయి..



నాలుగు ఆవులు ఉన్నాయి. ఇటీవల మేత నిమిత్తం 6 క్వింటాలు టీఎంఆర్‌ను ఆర్‌బీకే సెంటర్‌లో బుక్ చేశాను. దాణాను ఆవులు ఇష్టంగా తింటున్నాయి. ప్రభుత్వం మేత కొరతను నివారించడానికి సబ్సిడీపై దాణాను అందించడం అభినందనీయం.

– సిరిపురపు వెంకటస్వామి, పశుపోషకుడు, కలిదిండి మండలం, కోరుకొల్లు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడటౌన్ : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్‌ల మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పట్టణంలోని అన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఈఈ టి. రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించవలసిందిగా కోరారు.

వేగంగా ఉపాధి హామీ పనులు



గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండలంలో ఉపాధి హామీ పనులు చురుగ్గా సాగుతున్నాయని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ జీవీ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్‌తో కలిసి మండలంలోని పొనుకుమాడు తదితర గ్రామాలలో ఉపాధి హామీ పనుల తీరును ఆయన పరిశీలించారు. అనమనపూడిలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయ భవనాన్ని పరిశీలించి పనులు వేగవంతం చేయాలని ఏఈ రాధాకృష్ణకు సూచించారు. అనంతరం జనార్ధనపురం హౌసింగ్ కాలనీ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి మౌలిక వసతుల ఏర్పాటు చురుగ్గా సాగాలని హౌసింగ్ ఏఈ బాలాజీకి ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పనులు ఏఈ సుధాకర రెడ్డి, టీఏ శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం

పామర్రు: ఎస్‌బీఐ, ఎల్‌ఐసీ సంస్థల నుంచి అదానికి పెట్టుబడులు పెట్టించడం ద్వారా ప్రభుత్వ రంగం సంస్థలు దివాళా తీసే పరిస్థితి నెలకొంటోందని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి పెదపూడి దిలీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద నుంచి ఎస్‌బీఐ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగి పోతున్నారని అన్నారు. రానున్న కాలంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500లకే గ్యాస్ బండను అందిస్తామని, రైతులకు మద్దతు ధరలు ఇచ్చి సకాలంలో ధాన్యం నగదుని జమ చేస్తామని అన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసే ఫైల్ పైనే మొదటి సంతకం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు చింతలపాటి సుబ్బారావు, టీవీ సుబ్బారావు, కొడాలి రాంబాబు పాల్గొన్నారు.

ఫైర్ డీజీపీ సునీల్‌కుమార్‌కు సత్కారం



గుడివాడటౌన్(నందివాడ): అగ్నిమాపక శాఖ డీజీపీగా నియమితులైన సునీల్‌కుమార్‌ను నందివాడ మండల అంబేడ్కర్ యూత్ సభ్యులు సత్కరించారు. శుక్రవారం ఆయన వ్యక్తిగత కార్యాలయంలో ఆయనకు అభినందనలు తెలిపారు. దళితబిడ్డగా ఉన్నత శిఖరాలను చేరుకుంటున్న సునీల్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి అభినందనలు తెలిపినట్లు యూత్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అంబేడ్కర్ యూత్ సభ్యులు పెయ్యల జగన్, గుజ్జుల లాజరు, బండి కోటి బాబు తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యంతో నేల సారవంతం



గుడ్లవల్లేరు: జీవ వైవిధ్యంతో సాగు నేల నేల సారవంతం అవుతుందని ప్రకృతి వ్యవసాయ ఎల్2 ఎస్ఎఫ్ పరసా అరుణకుమారి అన్నారు. పెంజెంద్ర ఆర్బీకేలో శుక్రవారం ఆమె రైతులకు 30రకాల విత్తనాలతో పచ్చి రొట్టను వేసే విధానాన్ని విశదీకరించారు. ఈ సందర్భంగా విత్తన గుళికలు తయారీ విధానాన్ని ప్రదర్శించారు. ప్రకృతి వ్యవసాయంతో కలిగే ప్రయోజాలపై రైతులతో ర్యాలీని చేపట్టారు. వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల మండల కన్వీనర్ బలుసు జితేంద్ర, గ్రామ సర్పంచి రేమల్లి తాతబ్బాయ్, ఎంపీటీసీ పోలుకొండ వైదేహి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

కనుమూరు(పామర్రు): ప్రస్తుత వేసవి కాలంలో పచ్చిరొట్ట పైరులుగా 32 రకాల విత్తనాలు చల్లితే నేలలో సారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం అధికారులు తెలిపారు. మండల పరిధి కనుమూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సాగుపై పీఎండీఎస్ ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో భవిష్యత్‌లో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. 32 రకాల పచ్చిరొట్ట విత్తనాలను ప్రదర్శించామన్నారు.

చిరునవ్వుతో రోగాలు దూరం



ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ఎమ్మెల్యే డీఎన్నార్

కై కలూరు: చిరునవ్వుతో రోగులను పలకరిస్తే సగం ఉపశమనం కలిగినట్టేనని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం చైర్మన్ హోదాలో ఎమ్మెల్యే శుక్రవారం నిర్వహించారు. సీహెచ్‌సీ స్థాయిని 30 పడకల నుంచి 50 పడకల వరకు విస్తరించిన తర్వాత రోగులకు మరిన్ని మంచి సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందిని అభినందించారు. త్వరలోనే 5 పడకల డయాలిసిస్ సెంటర్ అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఆస్పత్రిలో పిల్లల, కంటి డాక్టర్లను నియమించాలని ఫోన్‌లో జిల్లా వైద్య సేవల అధికారి కృష్ణతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు రాంబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మీగడ వెంకట కృష్ణారావు, దూలం వీర శ్యామ్ ఫణికుమార్, నెక్కల శ్యామల, వైద్యులు గీతాంజలి, కీర్తి, రమ్య, పట్టణ సీఐ ఎంపీఎస్.నాగరాజు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

గుడివాడటౌన్ : పురుషులతో సమానంగా మహిళలు విద్యావంతులు కావడానికి మార్గదర్శకురాలు సావిత్రీబాయి పూలే అని గుడివాడ నియోజకవర్గ బీసీ సంఘం నాయకులు అన్నారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని బీసీ సంఘం కార్యాలయంలో శుక్రవారం సావిత్రీబాయి పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి, మహిళా విద్యకు కారకులైన జ్యోతీరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలను త్వరలో పట్టణంలో ఏర్పాటు చేసి యువతకు వారి గొప్పదనాన్ని వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు దారం నరసింహారావు, మహిళా అధ్యక్షురాలు యశోద యామినీదేవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులకొల్లు మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులు అగస్తి ఆదివిష్ణు, జిల్లా ఉపాధ్యక్షులు డి. వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

ఎరువుల అమ్మకాలు త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటమణి

మండవల్లి: ఎరువుల అమ్మకాలు పూర్తికాని వీఏఏలు త్వరితగతిన పూర్తి చేయాలని సహాయ వ్యవసాయ సంచాలకుడు జి. వెంకటమణి పేర్కొన్నారు. స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో శుక్రవారం గ్రామ వ్యవసాయ సహాయకులకు రివ్యూ సమావేశం జరిగింది. ప్రతి ఆర్‌బీకేలో కియోస్క్ ఫంక్షనింగ్ ఆన్‌లైన్‌లోకి రావాలని చెప్పారు. వైఎస్సార్ యాప్‌లో పూర్తి స్థాయిలో వివరాలు ఉండే విధంగా సిద్ధం చేయాలని సూచించారు. వీఏఏల వద్దనున్న ఫెర్టిలైజర్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో హబ్ మేనేజర్ పద్మజారాణి, మండల వ్యవసాయాధికారి ఎస్కే జరీనా, మండవల్లి, ముదినేపల్లి వీఏఏలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్



వృద్ధునితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కై కలూరు: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 187వ రోజు ఆలపాడు గ్రామ శివారు సోమేశ్వరం కాలనీలో శుక్రవారం జరిగింది. ముందుగా బీఆర్ అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మూడున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన కుటుంబాలకు కరపత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డ్రెయిన్ల సమస్యను ఎమ్మెల్యేకు వివరించారు. కొందరు తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయాలన్నారు. సంబంధిత అధికారులకు ఆ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ కురెళ్ల బేబీ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, ఆలపాడు ఎంపీటీసీ నల్లగచ్చు ధనలక్ష్మి, సర్పంచ్ కొప్పుల వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ సలాది జ్యోతి, ఆలపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు పడమట శేషావతారం, మండల పార్టీ అధ్యక్షుడు బత్రాజు శివాజీ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో ఇంటి నిర్మాణాలు



కలిదిండిలో ఇంటి నిర్మాణాలకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కై కలూరు: తక్కువ ఖర్చుతో ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. కలిదిండి జగనన్న హౌసింగ్ కాలనీలో ఆర్త హోమ్స్ భాగస్వామ్యంతో నిర్మితమవుతున్న ఇళ్లకు శుక్రవారం భూమిపూజ చేశారు. అనంతరం ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతూ మెట్లు, చుట్టూరా ప్రహరీ, పైన పిట్టగోడతో పాటుగా డబుల్ బెడ్ రూమ్ ప్లాటు అతి తక్కువ రుసుంతో నిర్మించడానికి ఆర్త హోమ్స్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కలిదిండి, పడమటి పాలెం, లోడిదలంక, సంతోషపురం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు 17.94 ఎకరాల లే అవుట్‌లో 755 స్థలాలు ఇచ్చామని, అందరూ ఇంటి నిర్మాణాలు త్వరగా చేపట్టాలన్నారు. ఆర్త హోమ్స్ యజమాని నారాయణరెడ్డి మాట్లాడుతూ లాభాపేక్షతో కాకుండా సేవా దృక్పథంతో నిర్మాణాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ బొర్రా సత్యవతి, సర్పంచ్ మసిముక్కుల మారుతీ ప్రసన్న, వైస్ ఎంపీపీ నాగలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మహమ్మద్ సఫాయితుల్లా, తహసీల్దారు తేజోమణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, లబ్ధిదారులు, వలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం కొండంగిలో హనుమత్ లక్ష్మణ సీతా సమేత కోదండ రామాలయ విగ్రహప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏఎంసీ చైర్మన్ ఐనాల బ్రహ్మాజీరావు, వైస్ ఎంపీపీ కనకదుర్గారాణి, సర్పంచ్ తిరుమలశెట్టి జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు ఇమ్మానేని లక్ష్మణరావు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి ఆర్థికసాయం



గుడివాడటౌన్ : అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి రూ. 10 వేలు వితరణగా ఇచ్చినట్లు విక్టరీ బాప్టిస్ట్ అసోసియేషన్ గుడివాడ అధ్యక్షుడు మద్దాల పండు శుక్రవారం తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ కాలనీకి చెందిన పాస్టర్ ఇశ్రాయేల్ కుమార్తె గత 15 సంవత్సరాలుగా మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో వైద్య ఖర్చుల నిమిత్తం తమ అసోసియేషన్ ద్వారా ఈ వితరణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్‌లు జి. శ్యామ్‌బాబు, మందా సువర్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతకు సత్కారం



గుడివాడటౌన్ : పట్టణానికి చెందిన మాచర్ల రామ కృష్ణ (ఆర్‌కే) శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఓ మహిళకు రక్తం అవసరం కాగా రామ కృష్ణ స్పందించి రక్తదానం చేశారు. చిన్నతనం నుంచే రక్తదానం చెయ్యడం అలవాటుగా చేసుకున్న ఆర్‌కే నేడు 55వ సారి రక్తదానం చేసి రికార్డు సృష్టించారు. ఇన్నిసార్లు రక్తదానం చేస్తూ పలువురికి ప్రాణదాతగా నిలిచిన ఆర్‌కేను శుక్రవారం పలువురు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కే యూత్ సభ్యులు పాల్గొన్నారు.

14న నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ గీతాబాయి



తోట్లవల్లూరులో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాయిప్రసన్న

గుడ్లవల్లేరు: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 14వ తేదీన నులి పురుగుల నివారణ మాత్రలను ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేయాలని డీఎం అండ్ హెచ్‌ఓ గీతాబాయి ఆదేశించారు. గుడ్లవల్లేరు పీహెచ్‌సీని శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. నులి పురుగుల నివారణా మాత్రల పంపిణీపై సిబ్బందికి ప్రత్యేక సమావేశాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వి.దిలీప్‌కుమార్, గుడ్లవల్లేరు, కౌతవరం పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది, ఏఎన్ఎమ్‌లు, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణపై అవగాహన

మొవ్వ: నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఈ నెల 14వ తేదీన గ్రామాల్లో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి. సుధాప్రవీణ్ తెలిపారు. దీనిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 2–19 సంవత్సరాల మధ్యగల వారికి ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లను పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొవ్వ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం. వేదరాజ్, మొవ్వ, నిడుమోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్య సిబ్బంది, సీహెచ్‌వో డి. శంకరరావు, ఎంపీహెచ్‌వో పి. శివ ప్రసాద్, హెచ్‌వీ పి. విజయకుమారి, ఆరోగ్య కార్యకర్త కె. రామాంజనేయులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

తోట్లవల్లూరు: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 14న జరిగే నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీని విజయవంతం చేయాలని తోట్లవల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న సూచించారు. ఈ విషయమై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమీక్ష సమావేశం శుక్రవారం జరిగింది. నులిపురుగుల మాత్రల పంపిణీలో మండల పరిషత్ అధికారులు, విద్యాశాఖ సిబ్బంది తమ వంతు సహకారం అందించాలని డాక్టర్ సాయిప్రసన్న కోరారు. మండల పరిషత్ కార్యాలయ ఏఓ ఉషారాణి, సీహెచ్‌ఓ కోటేశ్వరమ్మ, ఎంపీహెచ్‌ఈఓ మాణిక్యం, ఆరోగ్య, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల మాత్రలు తీసుకోవాలి

కైకలూరు: నులిపురుగుల మాత్రలను విద్యార్థులకు తప్పక అందించాలని ఈవోపీఆర్డీ రవిశంకర్ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 14, 18వ తేదీల్లో జరిగే జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంపై శీతనపల్లి, కొల్లేటికోట పీహెచ్‌సీల పరిధిలో వైద్య సిబ్బంది, ఎఎస్ఎంలకు సమావేశం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో కొల్లేటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిరణ్, పంచాయతీ కార్యదర్శులు తనూజా, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణే ప్రభుత్వ లక్ష్యం

పామర్రు: పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం ఈనెల 14వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ మహోత్సవాన్ని (డివార్మింగ్ డే) నిర్వహించనున్నట్లు పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు నులిపురుగుల నివారణ మందుల కిట్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీడీవో వై. రామకృష్ణ, ఎంఈవో పి. విజయలక్ష్మి, పామర్రు పీహెచ్‌సీ వైద్యురాలు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

13న చెరువు సాగు హక్కులకు వేలం

ముదినేపల్లి రూరల్: మండలంలోని చేవూరు శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయానికి చెందిన చేపల చెరువు వేలంపాటలు ఈ నెల 13న నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు చైర్మన్ వల్లభనేని సంపూర్ణ తెలిపారు. ఆలయానికి గ్రామంలో 1.95 ఎకరాల చేపలచెరువు ఉన్నట్లు చెప్పారు. ఈ చెరువులో 3 సంవత్సరాల పాటు చేపలు పెంచుకునేందుకు టెండరు కం బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.25వేలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనవచ్చన్నారు.

ఈనెల 13న సర్వసభ్య సమావేశం

పామర్రు: మండల ప్రజా పరిషత్ కార్యాలయం సర్వసభ్య సమావేశం ఈనెల 13న తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వై. రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ సమావేశం ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని అన్నారు. మండల ప్రజా పరిషత్ సభ్యులు, అన్నిశాఖల అధికారులు తప్పని సరిగా పాల్గొనాలని అన్నారు. అధికారులు వచ్చే సమయంలో ఆయా శాఖలను సంబంధించిన పూర్తి సమాచారాన్ని తమ వెంట తీసుకురావాలని అన్నారు.

మహిళలకు సన్మానం



వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మహిళలకు సన్మానం

కైకలూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఆటపాక సర్పంచ్ తలారి మణి, పలువురు మహిళా అధ్యాపకులను ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రంగోళి, వంటల తయారీ, స్పోర్ట్స్ అంశాలలో నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వై.జ్ఞానప్రసూనాంబ, సంధ్య, జాలాబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు: మరమ్మతుల నిమిత్తం కైకలూరు మండలంలో కైకలూరు టౌన్ సెక్షన్, మండవల్లి మండలంలో పెరికేగూడెం, పుట్లచెరువు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.రామకృష్ణ శుక్రవారం చెప్పారు.

సెలవు రోజుల్లోనూ పన్ను చెల్లింపునకు అవకాశం

గుడివాడటౌన్ : మున్సిపల్ పరిధిలో ఆస్తి, నీటి, ఖాళీ స్థలాల పన్ను చెల్లింపునకు ఆదివారం, రెండో శనివారం, సెలవు దినాల్లో కూడా అవకాశం కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి. మురళీకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లింపు గడువు ఈనెల 31వ తేదీతో ముగుస్తున్న నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం ఈ ఏర్పాటు చేశామన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలల్లో విద్యుత్ మరమ్మతులు

ముదినేపల్లి రూరల్: మండలంలోని నాడు–నేడు మొదటి దశ పనులు పూర్తిచేసిన పాఠశాలల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా మరమ్మతులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. నాడు–నేడు పథకం కింద పలు పాఠశాలల్లో 9 రకాల అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో విద్యుత్ పనులు చేపట్టి తరగతి గదుల్లో విద్యార్థుల సౌలభ్యం కోసం ఫ్యాన్లు బిగించారు.

'ఉపాధి' సద్వినియోగం చేసుకోవాలి

మండవల్లి: ఉపాధిహామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంటీఏ నవీన్ పేర్కొన్నారు. మండలంలోని అయ్యవారిరుద్రవరం గ్రామంలో రూ. 85 వేల అంచనా విలువతో పంట కాలువ పనులను శుక్రవారం 32 మంది ఉపాధి కూలీలు చేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ఈ పనుల ద్వారా రైతుల సాగునీటి కష్టాలు కడతేరుతున్నాయన్నారు.